# మూడు పంటల కేసీఆరా.. మూడు గంటల కాంగ్రెస్సా..?

■ కాంగ్రెసోళ్లు మూడు గంటల విద్యుత్ చాలంటండ్రు
■ బీజేపోళ్లు మోటర్లకు మీటర్లు పెడతామంటర్రు
■ ప్రజలు ఆలోచన చేయాలె..
■ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
■ కోనాపూర్‌లో రైతు సభ


కోనాపూర్ రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, జూలై 19: రైతుల కోసం మూడు పంటల విధానంతో ముందుకెళ్తున్న తెలంగాణ ప్రభుత్వం కావాలా..? వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ ఇస్తామంటున్న కాంగ్రెసోళ్లు కావాలా..? అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రైతులను ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ సరఫరా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం కోనాపూర్ రైతు వేదిక ఆవరణలో క్లస్టర్ పరిధిలోని రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో రాత్రి కరెంట్ వల్ల కరెంట్ షాక్, పాముకాట్లతో రైతులు చనిపోయారన్నారు. నాడు కాంగ్రెస్ హయాంలో రైతులకు సరిపడా నీళ్లు, కరెంట్ ఇవ్వని విషయాన్ని రైతులు ఇంకా మర్చిపోలేదని అన్నారు. కాంగ్రెస్ దళారుల కోసం, బీజేపీ అదానీ, అంబానీ కోసం పనిచేస్తే రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తున్నదని స్పష్టం చేశారు. రైతులకు మూడు గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ పార్టీ విధానాలపై రైతులు ఆలోచన చేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒకటేనని వ్యాఖ్యానించారు. బీజేపీ మోటర్లకు మీటర్లు పెట్టాలని, కాంగ్రెస్ 24 గంటల విద్యుత్ వద్దని అంటున్నదని, ఈ రెండు పార్టీల విధానాలను ప్రజలను గమనించాలని సూచించారు. రైతులను ఆగం చేయాలన్నది ప్రతిపక్షాల ఆలోచన అని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డికి కరెంట్, నీళ్ల గురించి, కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో కనీసం చెరువుల్లో తట్టెడు మట్టి తీసారా అని ప్రశ్నించారు. వర్షాల కోసం నాడు మేఘమథనం పేరుతో వేల కోట్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు. నాడు రైతులు కరెంట్ కోసం రాత్రిళ్లు ఎదురుచూడడం, ఎరువుల కోసం తమ చెప్పులను లైన్లలో పెట్టిన రోజులు మర్చిపోలేదని మండిపడ్డారు. మళ్లీ అలాంటి రోజులు కావాలా అని రైతులను కోరారు. ఇథనాల ఫ్యాక్టరీపై కాంగ్రెస్ నాయకులు గందరగోళం సృష్టించారని, ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరీ ఇథనాల్‌తో 60 శాతం ఇంధనాన్ని వాడుకోవచ్చని స్టేట్‌మెంట్ ఇచ్చారన్నారు. రూ.800 కోట్లతో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అడ్డం పడుతున్నారని విమర్శించారు. అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్ర రాష్ట్రంలో బియ్యం చాలడంలేదని, తమ రాష్ట్రానికి 70 వేల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలని ఆ రాష్ట్ర సీఎం జగన్ ప్రధాని మోదీని అడిగారని గుర్తు చేశారు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే ఏటా 7లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండిస్తున్నామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వం బియ్యంలో కోత విధించిందని, వారికి మూడున్నర మెట్రిక్ టన్నుల బియ్యం కావాలని మన ప్రభుత్వాన్ని అడుగుతున్నారని తెలిపారు. అక్కడ బియ్యం సరిపడా లేక వాటి బదులు డబ్బులు ఇస్తున్నారన్నారు. తమిళనాడులో కూడా 4 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలని అడుతున్నారని అన్నారు. కర్ణాటక, తమిళనాడు అడుగుతున్న 7 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఒక్క మన జిల్లాలోనే పండిస్తున్నామన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ చేరుకుందని హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీళ్లు శ్రీరాంసాగర్‌లోకి వచ్చాయని, ఇప్పుడు కరీంనగర్ నుంచి కిందికి వదులుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్ గౌడ్, ఆర్‌బీఎస్ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, వింగ్ చైర్మన్లు గురునాథం మల్లారెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పలు కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు


ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మల్యాల, జూలై 19: మండలంలోని పలు కుల సంఘాల భవన నిర్మాణానికి మంజూరైన నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం బూరుగుపల్లిలోని తన నివాస గృహంలో అందజేశారు. తక్కళ్లపల్లిలో గౌడ సంఘ భవనానికి రూ.4 లక్షలు, రాంపూర్ గ్రామంలోని యాదవ సంఘ భవనానికి రూ. 4 లక్షల నిధులు మంజూరు కాగా ఆయా కుల సంఘ పెద్దలకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, సర్పంచులు గొడుగు కుమారస్వామి, బద్దం తిరుపతి, కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న జాబ్, వీసా మేళా : ఎస్పీ భాస్కర్

జగిత్యాల కలెక్టరేట్, జూలై 19: నిరుద్యోగ యువతీయువకులకు విదేశాల్లో కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా జాబ్, వీసా మేళాను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ, ఎల్ఎం కొప్పుల సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 5న ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో నిర్వహించనున్న మెగా జాబ్, వీసా మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మెగా జాబ్, వీసా మేళాలో వివిధ దేశాలకు చెందిన 100 ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరై 400 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నారని, విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు ఇదొక సువర్ణావకాశమని అన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి అక్కడే నియామక పత్రాలు అందజేస్తారని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటస్వామి, రాజశేఖర రాజు తదితరులు పాల్గొన్నారు.

## పలు పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు

జగిత్యాల టౌన్, జూలై 19: మండలంలోని హన్మాజీపేట్, పొరండ్ల, బాలపల్లి, హైదర్‌పల్లి, కన్నాపూర్, కల్లెడ, తక్కళ్లపల్లి, సంగంపల్లి, సోమన్‌పల్లి, హబ్సీపూర్, అనంతారం, గుల్రాజ్‌పల్లి, లక్ష్మీపూర్, పొలాసలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో తపస్ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల రాజశేఖర్, జిల్లా బాధ్యులు విప్పరి శ్రీనివాసమూర్తి, గుండు రామకృష్ణ, చిక్కుళ్ల రమేశ్, మధు, మునీందర్, ఆర్మూర్ భీమయ్య, రూరల్ మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూర్మాచలం రఘునందన్, కొండూరి రజినీకాంత్, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోలార్‌పై మహిళలకు అవగాహన

కొడిమ్యాల, జూలై 19: హిమ్మత్‌రావుపేట గ్రామంలో బుధవారం సోలార్ విద్యుత్‌పై స్త్రీనిధి అధికారులు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) సంస్థ రీజినల్ మేనేజర్ పరమాచారి, ఏడీఎం లక్ష్మీకాంతం మాట్లాడుతూ, సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పునుగోటి కృష్ణారావు, శ్రీనిధి రీజినల్ మేనేజర్ ఆనందరావు, సెర్ప్ సీసీ వీరకుమార్, పంచాయతీ కార్యదర్శి పావని, తదితరులు పాల్గొన్నారు.

## హిమ్మత్‌రావుపేట సందర్శన

కొడిమ్యాల, జూలై 19: హిమ్మత్‌రావుపేట గ్రామాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ దివాకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించడంలో భాగంగా జిల్లా కమిటీ సభ్యులైన అడిషనల్ కలెక్టర్‌తో పాటు, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, డీఎస్సీ, డీపీవో దేవరాజ్ గ్రామంలో పలు విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజారాణి, ఫారెస్ట్ రేంజర్ లత, ఏవో జ్యోతి, ఏపీవో సతీశ్, సర్పంచ్ పునుగోటి కృష్ణారావు, కార్యదర్శి పావని, తదితరులున్నారు.

## ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

కోరుట్ల రూరల్, జూలై 19: ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజేశ్ అన్నారు. కోరుట్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు బుధవారం ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు, సవరణ, తొలగింపు తదితర ఫారాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు నమోదు చేయాలన్నారు. అనంతరం ఓటరు నమోదు ప్రక్రియపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు అందె శివప్రసాద్, కృష్ణ మోహన్, చంద్రశేఖర్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి: డీఎంహెచ్‌వో

జగిత్యాల అర్బన్, జూలై 19: నులి పురుగుల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుప్పాల శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషక లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ప్రభావాలుంటాయన్నారు. పిల్లల్లో నులి పురుగుల నివారణకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆరు నెలలకోకసారి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నదని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే పిల్లల్లో నులి పురుగుల నివారణ వంద శాతం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 2,50,164 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు తెలిపారు. 1–19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఈ మాత్రలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 22 పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 839 ప్రభుత్వ, 316 ప్రైవేట్ పాఠశాలలు, 54 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 1065 అంగన్ వాడీ కేంద్రాల పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించడానికి జిల్లా వ్యాప్తంగా 745 మంది ఆశ కార్యకర్తలు, 1065 మంది అంగన్ వాడీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని వివరించారు.

## పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం


దాతను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థినులు

మేడిపల్లి, జూలై 19 : భీమారం మండలం గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కోసం ప్యాట నారాయణ ఏర్పాటు చేసిన రూ.50వేల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు దాత నారాయణను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, మాజీ సర్పంచ్ తోకల నర్సయ్య, హెచ్ఎంలు లక్కంపల్లి రాజేశ్, దేవరాజం, నాయకులు నెల్లుట్ల ప్రభాకర్, జుంబర్తి సంజీవ్, పుల్లూరి దేవయ్య, ప్యాట వెంకటేశ్, పోతరాజు వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, పక్కన ఎస్పీ భాస్కర్

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి

■ కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్ ■ రోడ్డు భద్రతా కమిటీ సమావేశం

జగిత్యాల కలెక్టరేట్, జూలై 19: ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, ఇక నుంచి ఏ ఒక్కరూ కూడా ప్రమాదంలో మృత్యువాత పడకుండా రోడ్డు భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నాణ్యతలేకుండా ఉండడం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, సైన్ బోర్డులు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఆర్అండ్‌బీ, రోడ్ అథారిటీ, పీఆర్ అధికారులు సంబంధిత ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలకు చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పట్టణాల్లో పార్కింగ్ సౌకర్యం లేనందున రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారని, సరిపడా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ దవాఖాన, ఏరియా దవాఖానాల్లో రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించేందుకు ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగే సందర్భాల్లో క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు సమీపంలో ఉండే దవాఖానల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను రోడ్లపై గల దాబాలు, హోటళ్ల వద్ద అమర్చాలని సూచించారు. అనంతరం ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అనాలిసిస్ బ్యూరోను ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతున్నామని వివరించారు. అన్ని శాఖల అధికారులతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా తరచూ ప్రమాదాలు జరిగే 55 బ్లాక్ స్పాట్లు గుర్తించామన్నారు. అక్కడ సైన్ బోర్డులు ఏర్పాటు చేయించామని చెప్పారు. ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ చంద్రారావు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చంద్రబాబు నాయక్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీధర్, ఆర్‌టీవో వంశీధర్, డీఎస్పీలు వెంకటస్వామి, శ్రీనివాస్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులు, రోడ్ సేఫ్టీ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.